హరహర..శంభో శంకర

- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- మారుమోగిన శివనామ స్మరణ
- వైభవంగా స్వామివారి కల్యాణం

మదనపల్లె సిటీ: శివనామస్మరణలతో శివాలయాలు మర్మోగిపోయాయి. శివరాత్రి పండుగ సందర్భంగా మదనపల్లె పట్టణంలో శనివారం శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలో శివపార్వతులు, శ్రీవల్లిదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల కళ్యాణం అర్చకులు విశ్వేశ్వరశర్మ, లక్ష్మణలు కనుల పండవగా నిర్వహించారు. ఈశ్వరరెడ్డి భక్తులకు అన్నదాన సంతృతరణ చేశారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి పూజలు చేశారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ పంచఫలమృత మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. స్థానిక సీటీఎం రోడ్డులోని మంజునాథ స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకరించి పూజలు చేశారు. స్థానిక బర్మావీధిలోని సాయిబాబా ఆలయంలో, అనంతయ్య బంగ్లావీధిలోని పంచాలింగాల మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులే స్వయంగా శివలింగాలకు పాలాభిషేకం చేశారు.

శనీశ్వరుడికి తైలాభిషేకాలు

శివరాత్రి, శనిత్రయోదశి పురస్కరించుకుని స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఫణికుమార్‌శర్మ నవగ్రహ హోమాలు, శనీశ్వరుడికి తైలాభిషేకాలు చేశారు. స్థానిక బర్మావీధిలోని షిర్డిసాయిబాబా ఆలయంలో శనీశ్వరుడికి తైలాభిషేకాలు చేశారు.

రూరల్ మండలంలో..

మండలంలో సీటీఎంలో గెవిగుండులో వెలసిన గవి గంగాధరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కుమారస్వామి,బాలాజీలు ప్రత్యేక అభిషేకాలు చేశారు. కాశీవిశ్వేశ్వరస్వామి, మదనపల్లె మండలం వేంపల్లెలోని మల్లయ్యకొండలోని మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా మహా శివరాత్రి మహోత్సవాలు

వాల్మీకిపురం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ ప్రాంతాల్లో వెలసిన శివాలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. స్థానిక శ్రీ లక్ష్మీకామేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామతాభిషేకం, బిల్వార్చాన, తైలాభిషేకం, నవధాన్యాభిషేకం తదితర కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. బహుదానది తీరాన వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామివారి ఆలయం, శ్రీకార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయములులో వెలసిన లింగోద్భవ మహా శివునికి ఉదయం నుంచి స్వామివారికి పంచామతాభిషేకంతో పాటు విశేష పూజలు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీకామేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి మండలంలోని విఠలంకు చెందిన రేగంటి రామానారాయణరెడ్డి భార్య రాణి, కుమార్తె సుష్మిత రెడ్డిలు పంచలోహ కిరీటం, కొత్తపల్లెకు చెందిన దండు రాజారెడ్డి, సాయి లక్ష్మీలు పంచలోహ కిరీటం వితరణగా ఆలయ ధర్మకర్త కరమల శంకరాచారి, ఉపసర్పంచ్ బిడ్డల కేశవరెడ్డిలకు అందజేశారు.



పీలేరులో కాశీవిశ్వేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



మదనపల్లె సిటీ: స్వామి దర్శనం కోసం క్యూలో భక్తులు

శివాలయాలలో ప్రత్యేక పూజలు

పెద్దమండ్యం: మహాశివరాత్రి సందర్భంగా పెద్దమండ్యం యోగభోగేశ్వరస్వామి, పాపేపల్లె, తాటిమాకులపల్లె శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మల్లయ్యగారిపల్లెలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. బత్తినగారిపల్లె మల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్దమండ్యం నుండి తంబళ్లపల్లె మల్లయ్యకొండకు భక్తులు తరలి వెళ్లారు. నేలమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నడకదారిన కొండకు వెళ్తుతున్న భక్తులకు అన్నదానం చేశారు.

శివనామ స్మరణ

పెద్దతిప్పసముద్రం: శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు శివనామ స్మరణలతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో అంకుర్పాణ, కలశ స్థాపన, ధ్వజావరోహణం, శివ లింగాలకు పాలాభిషేకం, శనైశ్వరునికి తైలాభిషేకం, నవ ధాన్యాలతో అభిషేకాలు చేశారు.

భక్తులతో మల్లయ్యకొండ కిటకిట

కురబలకోట: మండలంలోని అంగళ్లు మల్లయ్య కొండపై శనివారం శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులతో కొండంతా నిండింది. ఎనిమిది ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. నేరుగా కొండపై గుడి వద్దకే బస్సులు వెళుతుండడంతో భక్తులు ఊరట చెందుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి మౌనిక ప్రదర్శించిన కూచి పూడి, భరత నాట్యం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.



కలికిరి: విశేష అలంకరణలో సోమేశ్వరుడు

కలికిరి: మండల పరిధిలోని శివాలయాలు భక్తుల శివనామ స్మరణతో మారుమోగాయి. పట్టణంలో వెలసిన శ్రీ సోమేశ్వర ఆలయంలో పార్వతీ సమేత శివునికి విశేష పూజలు, బిల్వార్చన, పంచామృతం, పాలభిషేకాలు నిర్వహించారు. రాత్రి శివపార్వతుల కళ్యాణోత్సవం కనుల పండుగుగా జరిగింది. కలికిరితో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మేడికుర్తి వెలసిన పురాతన అగస్తీశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు హరిస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు పూజలు, అభిషేకాదులు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్రీరామిరెడ్డి, నిర్వాహకులు రత్నశేఖర్‌రెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

కేవీపల్లె : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ చింతమాకులపల్లెలో అక్కదేవతల ఆలయంలో ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీనీరెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గోరంట్లపల్లె పంచాయతీ జంగంపల్లెలో వెలసిన భ్రమరాంభిక సమేత మలికార్జునస్వామికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

బి.కొత్తకోట: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం స్థానిక చౌళేశ్వరాలయం భక్తులతో పోటెత్తింది. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించగా, చౌళేశ్వరస్వామికి కర్ణాటక నుంచి తెప్పించిన పలురకాల పూలతో ప్రత్యేకంగా అలంరించారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శివ పార్వతుల కళ్యాణోత్సవం వైభవంగా జరిపారు. అలాగే నాయనబావి పంచాయతీ ఆకులవారిపల్లె సమీపంలో వెలసిన పురాతన శివాలయం, బీరంగి గ్రామంలోని బండెన్నస్వామి ఆలయంలో వెలసిన శివాలయానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించారు. ఆర్యవైశ్య శివరాత్రి కమిటీ, ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పుష్పపల్లకిలో ఊరేగించారు.

హరహర మహాదేవ ..

పీలేరు రూరల్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని తలపుల పంచాయతీ అడవిపల్లె సమీపంలో వెలసిన శ్రీమద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయం హర హర మహాదేవ శంభోశంకర అంటూ శివనామస్మరణతో మార్మోగింది. శనివారం స్వామివారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పార్వతీదేవి సమేత పరమేశ్వరుని తలపుల నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, శివనామస్మరణతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద రాత్రి భక్తుల జాగారం కోసం హరికథాకాలక్షేపం నిర్వహించారు. సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అలాగే దొడ్డిపల్లి పంచాయతీ శివరామపురంలో వెలసిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పీలేరు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివనామస్మరణతో భక్తులు ఆది దంపతులను దర్శించుకున్నారు. శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు, అభిషేకాలతో ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, శివ పార్వతులకు ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతి, నగర సంకీర్తన, సాయంత్రం గిరిజా కళ్యాణం నిర్వహించారు. రాత్రి లింగోద్భవ సమయంలో శివునికి 108 లీటర్లతో పాలాభిషేకం చేశారు.

రామసముద్రం: మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం శివాలయాలు హర...హర..మహదేవా శంభోశంకర అంటు మారుమ్రోగాయి. మండలంలోని శ్రీవాలీశ్వరస్వామి, గుంతయంబాడిలోని శ్రీపుండీశ్వరస్వామి, మూగవాడిలోని పుండరీశ్వర స్వామి, రామసముద్రంలోని శ్రీవాలీశ్వరస్వామి , చంద్రశేఖరస్వామి , చెంబకూరులోని కాశీవిశ్వేర స్వామి, శ్రీలోకనాథస్వామి తదితర ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ, ఎగువబురుజుపల్లె, సరిమడుగు, ప్యారంపల్లె గ్రామాల్లో శనివారం మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. గుర్రంకొండ, సరిమడుగు గ్రామాల్లోని శ్రీ సిద్ధమల్లేశ్వర స్వామి ఆలయాల్లో ఏక రుద్రాభిషేకం, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వార్లకు రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు.

వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

నిమ్మనపల్లె: మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తవళం గ్రామంలోని శ్రీ యోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా మూల విరాట్టుకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ మంజుల, తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.







శనీశ్వరుడికి తైలాభిషేకం చేస్తున్న అర్చకులు , వాల్మీకిపురం: పంచలోహ కిరీటం అందజేస్తున్న దాతలు, బి.కొత్తకోటలో శివపార్వతుల కల్యాణోత్సవం, పీలేరు రూరల్ : మద్దుండాల మల్లేశ్వరస్వామిని ఊరేగింపు, రామసముద్రం : భక్తులతో శివాలయం కిటకిట

క్లుప్తంగా

నేడు బ్రహ్మ రథోత్సవం

పెద్దతిప్పసముద్రం: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు రథోత్సవంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మహాశివరాత్రి పురస్కరించుకుని మదనపల్లె ఆర్టీసీ 1,2 డిపో బస్సులు శైవక్షేత్రాలకు ప్రత్యేకంగా నడిపారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండకు, నిమ్మనపల్లె మండలం తవళం నేలమల్లేశ్వరస్వామి ఆలయం, కలకడ ఝరికోన, తలకోన, అంగళ్లు మల్లయ్యకొండలకు ప్రత్యేక సర్వీసులు నడిపినట్లు డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం మేరకు.. ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలం బోర్లపల్లెకు చెందిన సి.నరేష్ మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో అరెస్టు చేశామని చెప్పారు. నిందితుడి నుంచి 38 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారిపల్లి సమీపంలోని గంగమ్మ గుడి వద్ద శనివారం ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో సందీప్, అహమ్మద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

అర్చకుడిపై దాడి చేసిన వారిపై కేసు

రామసముద్రం: మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ బలసముద్రం కొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు లోకనాథదీక్షిత్‌పై శుక్రవారం దాడి చేసి గాయపరచిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాలీశ్వరస్వామి కొండపై ఏటా జరిగే స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడితో పాటు మరో ఇద్దరు అర్చకులకు , బలసముద్రం గ్రామస్తులైన నందుకుమార్, మల్లికార్జున మధ్య ఆలయంలో క్యూ ఏర్పాటులో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయమై నందకుమార్, మల్లికార్జున తనపై దాడి చేసి గాయపరిచారని లోకనాథదీక్షిత్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

20 మంది జూదరుల అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, అమ్మచెరువుమిట్ట పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 20 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.27,850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరి నాలుగోబజారు పక్కన చెట్లపొదల్లో పేకాట ఆడుతున్న 11మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.21,150 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరితో పాటుగా అమ్మచెరువుమిట్ట ముళ్లపొదల్లో పేకాడుతున్న 9 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.6,700 నగదు సీజ్ చేశామన్నారు. దాడుల్లో టూ టౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా లేఅవుట్ పనులు



ప్లాట్లు సిద్ధం చేపిస్తున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : పేదలందికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా జగనన్న ఇంటి పట్టాల లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించడానికి లేఅవుట్ పనులు చురుగ్గా చేపట్టారు. స్థానిక మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ లేఅవుట్-3లో ప్లాట్లు సిద్ధంగా చేస్తున్నారు. శనివారం సర్పంచ్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో విడత 2065 మంది లబ్ధిదారులకు ప్లాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాయకులు మగ్బుల్, హరిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు శిక్షణ

మదనపల్లె సిటీ: దివ్యాంగుల విద్యార్థులకు ఒకేషనల్ ట్రెనింగ్ నిర్వహిస్తున్నట్లు వెలుగు ప్రత్యేక పాఠశాల కార్యదర్శి ఉదయమోహన్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక అమ్మచెరువు మిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను ప్రత్యేక పాఠశాలలో చేర్పించి ప్రత్యేక విద్యను అందించడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత పనుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్య, భార్గవి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై భక్తుల రద్దీ

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండ మహాశివరాత్రి సందర్భంగా శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి గోపిదిన్నె ఎస్.మల్లికార్జునరెడ్డి రూ.2.50 లక్షలతో ప్రత్యేక అలంకరణ చేయించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కాలినడకన మల్లయ్యకొండకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.ఆర్.మల్లిరెడ్డి, అర్చకులు ఈశ్వరప్పలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. మల్లికార్జునస్వామి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ జరిగింది. ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ భక్తులకు భోజనం వడ్డించారు. మల్లయ్యకొండకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడంతో భక్తులు లక్షల సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఎస్.ఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు నడిపారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలేరు మండల సచివాలయ కన్వీనర్‌గా కె. ఆనందబాబు, వాల్మీకిపురం మండల సచివాలయ కన్వీనర్‌గా బండి వెంకట్రమణ (రాయుడు), కలికిరి మండల సచివాలయ కన్వీనర్‌గా పి. రెడ్డెప్ప, కలకడ మండల సచివాలయ కన్వీనర్‌గా మోహన్‌రాజ, గుర్రంకొండ మండల సచివాలయ కన్వీనర్‌గా సి.నాగేంద్ర, కె.వి.పల్లి మండల సచివాలయ కన్వీనర్‌గా పి.సతీష్ రెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన కన్వీనర్లకు భవిష్యత్తులో పార్టీపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. జగనన్నే మా భవిష్యత్తు నినాదంతో కన్వీనర్లు, గృహసారథులు వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి గత ప్రభుత్వానికి, వైఎస్ జగన్ ప్రభుత్వానికి తేడాను అర్థమయ్యేలా వివరించాలన్నారు.



సచివాలయ కన్వీనర్లతో ఎమ్మెల్యే చింతల

బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలి

మదనపల్లె : వ్యవసాయానికి ప్రోత్సాహం దిశగా వివిధ రకాల బ్యాంకింగ్ సేవలు అందించడం జరుగుతోందని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్, నెట్‌వర్క్-3 జనరల్ మేనేజర్ ఖాద్రి గుండూరావు తెలిపారు. మండలంలోని పొన్నేటిపాళ్యం గ్రామంలో శుక్రవారం ఎస్‌బీఐ చిత్తూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో రాత్రి శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయానికి సంబంధించి బ్యాంకు అందిస్తున్న సేవలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు రుణాలు తదితరాలపై రైతులు, మహిళలకు అవగాహన కల్పించారు. బ్యాంకు అందించే రుణాలతో ఆర్థికంగా ఏ విధంగా అభివృద్ధి చెందవచ్చనే విషయమై డీజీఎం ఆర్.వరదరాజ వివరించారు. రైతులకు బ్యాంకింగ్ సేవలపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. రూ.30 కోట్ల వ్యవసాయం, ఎస్‌హెచ్‌జీ గ్రూపు రుణాలకు సంబంధించి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్‌ఎం.శ్రీవాణి కిషోర్‌కుమార్‌రెడ్డి, మద్దిరెడ్డి, సర్పంచ్‌లు పసుపులేటి చలపతి, ఆనందరెడ్డి, ఎస్‌బీఐ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న ఎస్‌బీఐ జీఎం ఖాద్రి గుండూరావు

గజవాహనంపై సిద్దేశ్వరుడు

కలకడ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామి గాండ్ల కులస్తులు ఏర్పాటు చేసిన గజవాహనంపై ఊరేగారు. శుక్రవారం రాత్రి అలంకరించిన చాందినీబండిపై స్వామి వారిని రంగు రంగుల విద్యుత్‌దీపాలతో కలకడ పురవీధులలో ఊరేగించి, ఇంటింటి పూజలు అందుకున్నారు. అనంతరం స్వామివారు శనివారం ఆలయ ప్రవేశం చేశారు. శనివారం రాత్రి శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన మన సంస్కృతి కళాసంస్థ వారి ఆధ్వర్యంలో 108 భక్తి గీతాలను ఆలపించారు.



ఏడుగురిపై కేసు నమోదు

కలకడ : స్థలం విషయంలో ఘర్షణ పడిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లె సమీపంలోని శృతి పాలడెయిరీకి చెందిన భూమి వద్ద కలకడ మండలకు చెందిన మల్లికార్జున నాయుడు, బాలాజి, వెంకట్రమణ, శెట్టిపల్లె చంద్రలు ఒక వర్గం గాను, చిత్తూరు జిల్లా సదుం మండలం బూరగమంద పంచాయతీ గాండ్లపల్లెకు చెందిన పెద్దరెడ్డెప్ప, జగన్‌మోహన్, సుధాకర్ మరొక వర్గంగా ఘర్షణ పడ్డారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు

ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడిచేసి గాయపరిచిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. కలికిరి మండలం గుండ్లూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శరత్‌ను కెవిపల్లె మండలం తిమ్మాపురం గ్రామంకు చెందిన రామ్మోహన్, మురళి, సాయిప్రసాద్, నాగరాజ, రామయ్యలు శనివారం కొట్టి గాయపరచినట్లు బాధితుడు శరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



